# బూర్జువా కుక్క

నేను రోడ్డంటే పోతున్నాను. నా పక్కగా కారొచ్చి నిలబడ్డాది. కారులో ఆసామీ 'హల్లో' అంటే 'హల్లో' అన్నాను.

కారులో ఆసామీ సామాన్యుడు కాదు. బాగా చదువుకొన్నవాడనీ, ఉన్నతాశయాలు కలవాడనీ, ముఖ్యంగాపెద్ద స్థితిపరుడనీ ప్రతీతి. నాకు చిన్నప్పుడు బాగా స్నేహితుడు. పెద్దయిన తరువాత జీవితాలలో బాటలు వేరు వేరు అయిపోయాయి.

'నాతో నువ్వు రావాలి'. అన్నాడు.

దానికేం భాగ్యం? కారులో కెక్కించుకొని క్లబ్బుకి మోసుకుపోయి అక్కడ చిన్న ఫలహారం తగిలిస్తూ, మామూలు మాటలైనాక అతనో విశేషం చెప్పేడు.

'ఈ మధ్య నీ కథలు కొన్ని చదివేను. కథలు నన్ను కొసదాకా తీసుకెళ్లనూ తీసుకెళ్లాయి. నేను చదవనూ చదివాను. కథలో శిల్పం ఉంది. నేను సర్టిఫికేట్ ఇస్తున్నాను. గోడకి తగిలించుకో.' అన్నాడు.

'గోడకేం? మెడకే తగిలించుకోవాలి.' అన్నాను.

'అదే చెయ్యవలసింది. నా వంటి కల్చర్డు జెంటల్మన్ ఇచ్చిన తాఖీదు సామాన్యమైనది కాదు. నువ్వు నాకు చాలా కృతజ్ఞత చూపవలసివుంది కథలు చదివినందుకు. తరువాత నాకు కలిగిన భావాల మూలంగా నువ్వు కనబడగానే తన్ననందుకు!"

'కథలు ఆగ్రహానికి కారణమయాయా?'

'హొళ్లు మండుకొచ్చింది. ఆ రాతలు నాకు తలనొప్పి. చిన్నప్పుడు నీకెన్నో మధుర భావాలుండేవి. ఏమైనాయి? మధురస్వప్న శాఖగా విస్తరించవలసిన నీ సాహితి తుమ్మ కొయ్యగా చిగుళ్లు పెడుతున్నది. నీలో రొమాన్సు చచ్చింది.'

'రొమాన్సు కర్థం తెలుసా?'

'సరి! ఆంగ్లపదవిన్యాసం పొలరుదొర మన దగ్గర నేర్చుకోవాలి. నువ్వంతా పెడమార్గాన్ని పోతున్నావు. చిన్న సలహా ఇస్తాను."

'బాలాదపి సుభాషితమ్!'

'అప్రాచ్యుడా! నన్ను కుర్రవెధవని చేస్తావ్!"

'అని ఎక్కడన్నాను?'

'ధ్వనించేవు. ఆల్‌రైట్. ఈ మధ్య నీ కథలు కొన్ని చదవవలసి వొచ్చింది.'

'చిక్కే!'

'చిక్కేపడ్డాను. అవి నన్ను లాక్కుపోయాయి. దాంతో మరీ రిమ్మెత్తు కొచ్చింది. వాస్తవం చెపుతున్నాను. కాని కథలు చదివితే ఏడుపొచ్చింది. అనవసరంగా నీ మూలాన్ని మనస్సు పాడైంది. కథావస్తువుని బాగానే పని చేస్తావు. కాని చెప్పేనుగా పెడమార్గం పట్టేవు. కథల్లో ముఖ్యంగా నాకు నచ్చింది నువ్వు సృష్టించే వాతావరణం. నాకు చిన్న ఉపకారం చెయ్యాలి. చేస్తావా?'

'చెప్పు'

'నాకో కథ రాసి పెట్టాలి. జరిగిన విషయమే. నువ్వయితే అందంగా చెపుతావు.'

'చెప్పూ'

'మరేం లేదూ. గత సంవత్సరం 'లూసీ' అన్న తెల్లపిల్లని వెంట పెట్టుకుని ఊటీ వెళ్లేను. నెల్లాళ్లు దాన్ని నేను భరించటానికీ, అది భరించబడడానికి ఏర్పాటు.'

'భార్యా భర్తలుగా నెల్లాళ్లు కాలక్షేపం చెయ్యడానికి.'

'సరిగ్గా చెప్పేవు. డబ్బు మనకి బాగా వొదిలిపోయిందనుకో. అయితేనేం ఊటీ కొండలకి మేఘాలెంతందమో ఊటీ బంగాళాలకి లూసీ అంతందము. లూసీ తనతో 'బొర్జువా' (Borzoi) కుక్కనొకటి వెంట పెట్టుకొచ్చింది.'

'బూర్జువా కుక్కేమిటీ?'

'నీకు కుక్కలజాతులు తెలియవు. ఒర్థినాటు వెధవ్వి! ఎలాగ తెలుస్తుందిలే! బూర్జువా కాదు, బొర్జువా, అదొక ఐరోవా కుక్క!'

'బూర్జువా దొరసానిగారి బొర్జువా కుక్క.'

'బాగానే అన్నావు. దానికేం, ఉంపుడు కత్తె మీద మనకెంత మమకారమో పెంపుడు కుక్కమీద లూసీ కంత మమకారం. నాలుగు రోజులు ఊటీని 'బ్యూటీ' అన్నాము. బొర్జువా కుక్కకూడా మాతోపాటు ఊటీని ఆనందిస్తున్నాది. దానికి కూడా కావలసిన సొసైటీ, రొమాన్సు ఉన్నాయి. ఒకనాడు ఏ పాము కరిచిందో బొర్జువా చచ్చి పడివుంది!"

'లూసీకి చాలా పెద్దదెబ్బే!'

'హృదయానికి పెద్ద గాయం తగిలినట్టు ఏడుపులు మొదలెట్టింది.'

'పాపం!'

'ఆఁ పాపం! దీనేడుపు వినడానికి తీసికెళ్ళానా?'

'ఏం చేశావు?'

'ఇంకొక బొర్జువాని దాని తాతలాంటిదాన్ని కొనిస్తాను. కుక్క కోసం ఏడుపేమిటి? అన్నాను. విరహతాపంలాగ పట్టుకుంది. అంత మమకారమేమిటి? కుక్కపోతే కుక్కరాదూ? నేను చెప్పేశాను. నా ఎదుట ఏడుపులు పనికిరావు. లేకపోతే వచ్చినతోవనే నడువు.' అన్నాను.

డబ్బు భాయ్! విస్కీ వైనులతో నా దగ్గర విచారాన్ని దిగమింగి దాని ఖర్మాన్నది ఒంటరిగా ఉన్నప్పుడు కుక్కకోసమేడ్చేది. నాకేం? నేను హాయిగా పావురాయిపక్షాల మీద ఊటీ విహాయసమంతా వలయగమనాలతో కాలం ఎగరనిచ్చేను.

ఊటీ నాకు కామెడీ. లూసీకి ట్రాజడీ, ఇదీ కథ. దీన్ని నువ్వు ఎలాగ రాస్తావో రసవంతంగా ఉండాలి.'

'తప్పకుండా రాస్తాను'.

'రాస్తావ్?'

'ఊఁ'

'నువ్వు రాయవు'.

నేను రాస్తానన్నా నమ్మలేకపోతున్నాడు! నా కథల మూలంగా నా మతం కొంత బోధపడి ఉంటుంది. అందుచేత రాయనని అనుమానపడుతున్నాడు. బాగా చిన్నప్పటి స్నేహితుడు. సాహిత్యాన్ని బాగా తరచినవాడు. కొన్ని గ్రంథాలకి కృతిపతి, కొన్ని ప్రచురణలకి రాజపోషకుడు, నాకు పెద్ద ఉపన్యాసమిచ్చేడు!

'ఈ మధ్యని కొందరు దరిద్రసంగీతం ప్రారంభించారు. దరిద్ర సంగీతానికి ఆకాశం, భూమి తాళం చిప్పలు చేసి సాహిత్యాన్ని దగ్ధం జేస్తున్నారు. వీర శైవులమని బురఖా తొడుక్కొని సాంఘికవాదం ప్రచారం చేస్తున్నారు. మహేశ్వరాస్థానంలో ఐశ్వర్యం బుగ్గి, బూడిదా! అక్కడ పుణ్ణిలో భిక్షని ఏమి జుఱ్ఱుకోగలం?

మన చుట్టూ ఏముంది? దరిద్రం, దుఃఖము ఉన్నాయి. దానికి మనమా బాధ్యులం? అది వాళ్ల వాళ్ల ఖర్మ. ఎక్కువతక్కువలకి అదే కారణం. పూర్వ జన్మ, పునర్జన్మ నేను నమ్ముతాను. ఆర్యులు చెప్పినది మహా సత్యము. ప్రజాస్వామ్య సాంఘికవాదాలన్నీ బుద్బుదాలు.

మనకేం? మనం పెళ్లి కొడుకులం. పట్టుపరుపు, ద్రాక్షసారా ఎదురుగా వున్నాయి. మన 'భార్య' ఎప్పుడూ తరుణి. రూపవతి. ఇది మన మన పుణ్యం. చుట్టూ అలో లక్షణా అని లక్ష మంది ఏడుస్తూ ఉండొచ్చు. అది వాళ్ల వాళ్ల కర్మ. మనకేం?

నువ్వు నాకు బాగా స్నేహితుడివి. చెడడానికి సిద్ధంగా వున్నావు. ఇప్పుడే సాహిత్యాన్ని దరిద్రులపాలు చేస్తున్నావు. ఇహ నది కట్టిపెట్టు.

కవి ఎలాగుండాలి? పాదుషాలాగుండొద్దూ? కప్పురపువిడెం అందివ్వవలసింది అందివ్వద్దూ? కవిత్వం ఎలా గుండాలి? ఫ్రెంచి వైను లాగ, రంగు, రింగు, గింగురూ ఉండొద్దూ?

అవన్నీ ఉండేటట్టు నా కథ రాయి. ఏమంటావు?' అన్నాడు.

నేను విపరీతమైన నవ్వు నవ్వేను. అతను చెప్పినదానికంతకీ ఆ నవ్వే జవాబు!

ఆ నవ్వుకి నాలుగువేల అంచులున్నాయి. ఇప్పుడు తిరిగి అలాగ నవ్వమంటే నా తరం కాదు. విని విని విన్న దానికి జవాబుగా అప్రయత్నంగా ఆ నవ్వు అతని మీద నయాగరాలాగ విరుచుకుపడ్డాది.

అతని జీవితం మీద, జీవితాశయాల మీద, నమ్మకాల మీద నాకు కలిగిన జుగుప్స, హేళన, ఆగ్రహము, తిరస్కారము – నాలో రేగిన లక్ష భావాలు ఆ వొక్కనవ్వులో వ్యక్తమైనాయి. భాషలో పదజాలానికి అతీతమైన ప్రతిభతో అనేక భావాలని సూక్ష్మంగా ఆ నవ్వు వ్యక్తపర్చింది.

అతను బాగా నొచ్చుకున్నాడు. సాహితీపరులంతా అతని చుట్టూ పరిభ్రమిస్తూ భజన చేస్తూ ఉంటారు. నా తిరస్కారాన్ని సహించగలడా?

'మీరంతా సాహిత్యానికి చీడపురుగులు. నీకు సరియైన మార్గం చెప్పేను. నీలో మారే స్వభావం లేదు. మారకపోతే మనిషికాడు. నేను చెప్పిన కథ నువ్వెక్కడ రాస్తావు? నిన్ను చూసి విచారించవలసి ఉంది. విచారించడం నా స్వభావం కాదు.'

అని అంత్యోపన్యాస మిచ్చి, నెత్తిమీద హేటు బోర్లించుకుని, బిల్లు తనే ఇచ్చేసి, నా మొహమైనా మరి చూడకుండా, కారులో దూరి స్టార్టు చేసుకుపోయాడు.

బోర్జువాకుక్క కథ నేను రాయననుకున్నాడు. అక్కడ నా నవ్వు పొరపాటు అభిప్రాయం అతనిలో కలిగించింది. కథ నేను రాశాను. ఆ వర్గ జీవితాన్ని దులపవలసిన రీతిగా దులిపి దులిపి రాశాను. రాస్తున్నంత సేపూ నా చుట్టూ ఆనందం గువ్వపిట్టలాగ గుబాళించింది.

❄

ఢంకా, ఏప్రిల్ – 1945

కథా నిలయం
శ్రీకాకుళం